క్లుప్తంగా

మసీదు అభివృద్ధికి రూ.50వేలు విరాళం



ఆత్మకూరు: పట్టణంలోని తూర్పువీధిలోని జామియా మసీదు అభివృద్ధికి సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు మంచి పరమేశ్వర రెడ్డి రూ.50వేలు నగదు విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో మసీదు అభివృద్ధి కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంపల్లి ప్రసాద్, కమిటీ సభ్యులు గౌస్‌బాషా, మసీదు ముజావర్లు, తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ నిజాయతీ



ఉదయగిరి: బస్సులో ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును భద్రంగా తనకు అందజేసి ఉదయగిరి డిపోకు చెందిన కండక్టర్ కే శ్రీనివాసులు తన నిజాయతీని చాటుకున్నాడు. వివరాలు.. ఉదయగిరికి చెందిన సయ్యద్ మున్వర్‌బాషా ఆదివారం నెల్లూరు బస్సులో ఎక్కి పర్సును పోగొట్టుకున్నారు. కండక్టర్ శ్రీనివాసులు గమనించి పర్సును తన వద్ద ఉంచుకున్నాడు. తిరిగి ఉదయగిరికి చేరుకున్న తరువాత డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు పర్సు, అందులోని రూ.1700 నగదు అందజేశారు. ఆయన పర్సులో ఉన్న అడ్రస్ ఆధారంగా బాధిత ప్రయాణికుడికి సమాచారం అందజేశారు. అనంతరం బాధితుడు డిపో వద్దకు రాగా కండక్టర్ చేతుల మీదుగా పర్సు, నగదు అందజేశారు. ఈ సందర్భంగా కండక్టర్‌ను పలువురు ఉద్యోగులు అభినందించారు.

ఘనంగా తహలీల్ ఫాతేహా



ఆత్మకూరు: పట్టణంలోని సుల్తాన్‌షహీద్ దర్గాలో నిర్వహిస్తున్న గంధ మహోత్సవం ఆదివారంతో ముగిసింది. చివరిరోజు తహలీల్ ఫాతేహా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధ ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు.

ఉచిత వైద్యశిబిరం



సోమశిల: అనంతసాగరం మండలం రేవూరు ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థి, నెల్లూరుకు చెందిన ఎనెల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత కే నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. న్యూరాలజిస్ట్ కుంకాల లావణ్య, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ దావూద్, తదితర వైద్యులు వేయి మందికిపైగా రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రప్రసాద్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్లంపాటి వెంకటేశ్వరరెడ్డి అభినందించారు.

బైక్‌పై నుంచి జారిపడి మహిళకు గాయాలు

ఉదయగిరి: బైక్‌పై నుంచి జారిపడి మహిళ గాయపడిన ఘటన మండలంలోని సున్నంవారి చింతల సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన పఠాన్ ఆసియా తన కుమారుడితో కలిసి బైక్‌పై ఉదయగిరికి బయల్దేరారు. సున్నంవారిచింతల వద్దకు రాగానే ఈదురుగాలులకు ఆమె చున్నీ బైక్ టైరుకు చుట్టుకోవడంతో కిందపడిపోయింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయం కాగా 108 వాహన సిబ్బంది ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

వర్షం పడితే నరకమే



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బంగ్లా సెంటర్ వద్ద చాకలికొండ రోడ్డు మార్గంలో చిన్న వర్షం పడిన నీరు నిల్వ చేరి బురదమయంగా మారుతోంది. దీంతో ఆటోలు, బస్సులను ఎక్కేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు చివర చిన్న కాలువ తీస్తే వర్షపు నీరు మొత్తం వెళ్లిపోతుంది. గతంలో వర్షపు నీరు వెళ్లేందుకు డ్రైనేజీ ఉన్నా చికెన్ దుకాణదారులు పూడ్చి వేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి దుకాణాలను నిర్మించుకుని కాలువను పూడ్చివేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా గరుడ సేవ



సంగం మండలం మర్రిపాడులోని చెన్నకేశవస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి గరుడ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామిని విశేషంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. గరుడ వాహనంపై కొలువుదీరి తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన దేవదేవేరులకు భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

–సంగం

శాకాంబరిగా గంగమ్మ



ఆషాఢ మాసం సందర్భంగా సంగంలోని పెన్నానది ఒడ్డున కొలువైన పాలేటి గంగమ్మతల్లి ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గంగమ్మను వివిధ రకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిసేవ జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

–సంగం

నేత్రపర్వంగా మహాలక్ష్మి గ్రామోత్సవం



చేజర్ల మండలం నడిగడ్డ అగ్రహారంలోని మహాలక్ష్మి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలో భాగంగా శనివారం అర్ధరాత్రి గ్రామోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

–చేజర్ల

నేటి నుంచి గ్రామసభలు

ఆత్మకూరురూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలాజీనాయక్ ఆదివారం తెలిపారు. 22న మహిమలూరు, 23న అప్పారావుపాళెం, పడకండ్ల, చెర్లోయడవల్లి, ఆరవేడు, 24న బండారుపల్లి, కరటంపాడు, వాశిలి, రామస్వామిపల్లి, రావులకొల్లు, నాగులపాడు, 25న బట్టేపాడు, బోయలచిరివెళ్ల, మురగళ్ల, నారంపేట, నువ్వూరుపాడు, 26న దేపూరు, కనుపూరుపల్లి, నల్లపరెడ్డిపల్లి, పమిడిపాడు, వెన్నవాడ గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని చెప్పారు. జల్‌జీవన్‌మిషన్, ఓడీఎఫ్ ప్లస్‌తో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామసభల్లో చర్చించి తీర్మాణాలు చేయనున్నట్లు తెలిపారు. గ్రామసభల్లో పంచాయతీల పాలకులు, అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

ఉదయగిరిని జిల్లాగా చేయాలని వినతి

ఉదయగిరి: వైఎస్సార్, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అన్ని విధాలా బాగా వెనుకబడిన బద్వేల్, పోరుమామిళ్ల, కనిగిరి, ఉదయగిరి, గిద్దలూరు ప్రాంతంలోని 21 మండలాలతో ఉదయగిరి కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని ఉదయగిరి జిల్లా సాధన కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం వారు అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు ఉద్యమాలు చేస్తున్నామని వివరించారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తే మెట్టప్రాంతాలు అన్ని విధాలా అభివృద్ధి చెంది ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. ఉద్యమ నేతలు డాక్టర్ వేణుగోపాల్, దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు జంక్‌ఫుడ్ ముప్పు

దుకాణాల్లో నాణ్యతలేని చిరుతిండ్ల విక్రయం

- చిన్నారులే లక్ష్యంగా రకరకాల స్నాక్స్ తయారీ
- ఆకర్షణీయమైన ప్యాకెట్లలో నింపి మార్కెట్లోకి తరలింపు
- చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

దుత్తలూరు: చిరుతిండ్లు చిన్నారుల జీవితాలను శాసిస్తున్నాయి. ఇంట్లో అమ్మ చేసే వాటి కన్నా బయట దుకాణాల్లో లభ్యమయ్యే చిరుతిండ్లనే చిన్నారులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు దుకాణాల్లో నాణ్యతలేని చిరుతిండ్లను విక్రయిస్తున్నారు. వాటిని తిని చిన్నారులు ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో వందలాది దుకాణాల్లో నాణ్యత లేని చిరుతిండ్ల ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత చిన్నారులే లక్ష్యంగా రకాల రకాల స్నాక్స్‌ను దుకాణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రంగురంగుల ప్యాకెట్లలో దర్శనమిచ్చే ఈ చిరుతిండ్లను చూడగానే వాటిని కొనివ్వాలంటూ చిన్నారులు మారం చేస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు కొనిస్తున్నారు. చివరకు అవి చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటి వలన భవిష్యత్తులో పెనుముప్పు తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా నకిలీ చిరుతిండ్లను విచ్చలవిడిగా మార్కెట్లోకి వదులుతున్నారు. స్నాక్స్ ప్యాకెట్లుగా వాటిని చలామణి చేస్తున్నారు. వాటిపై తయారయ్యే ప్రాంతం, చిరునామా, తయారీ తేదీ ఉండదు. సంస్థ పేర్లు కూడా అర్థం కాని రీతిలో ఉంటాయి. మరికొన్ని చిరుతిండ్ల ప్యాకెట్లు ప్రముఖ కంపెనీల పేర్లను పోలి ఉంటూ మార్కెట్లోకి వస్తున్నాయి. చూడగానే తినాలనిపించే విధంగా వాటిని తయారు చేస్తున్నారు. దుకాణాల్లో విచ్చలవిడిగా ప్యాకెట్ల దండలు వేలాడదీసి అమ్ముతున్నారు. జిల్లాలో రోజూ లక్షలాది రూపాయల చిరు తిండ్ల వ్యాపారం జరుగుతుందనేది నగ్నసత్యం. వీటిపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు కూడా లేకపోవడంతో ఎవరిష్టం వారిదే అన్నట్లుగా పరిస్థితి తయారైంది. కొన్ని కంపెనీలు తమ పాత సరుకును అమ్మేందుకు ప్యాకెట్లపై అధిక శాతం ఆఫర్ అంటూ దుకాణాలకు సరఫరా చేస్తున్నాయి. దుకాణదారులు వాటిని పరిశీలించకుండానే గడువు ముగిసిన ప్యాకెట్లను చిన్నారులకు అంటగడుతున్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు కూడా గమనించకపోవడం విచారకరం. ప్రముఖ కంపెనీలు కానీ, సాధారణ కంపెనీలు కానీ తయారు చేసే జంక్‌ఫుడ్ తినకపోవడమే ఉత్తమమని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ చిన్నారులు మారం చేసి కొనివ్వాల ని పట్టుబడితే గుర్తింపు కలిగిన కంపెనీల ప్యాకెట్ల ను గడువు తేదీని పరిశీలించి మాత్రమే కొనివ్వాలని సూచిస్తున్నారు. జంక్ ఫుడ్‌కు చిన్నారులను సాధ్యమైనంత వరకు దూరంగా పెట్టాలని సూచిస్తున్నా రు. పిల్లలకు రెడీమేడ్ ఫుడ్‌ను అలవాటు చేసే బదు లు ఇంట్లోనే వారికి ఇష్టమైన ఆహార పదార్థాలు, పిండి వంటలు చేసి పెట్టాలని చెబుతున్నారు. ప్యాకెట్‌లలో నిల్వ చేసిన ఫుడ్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల భవిష్యత్తులో దుష్పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. ఆహారం నిల్వతో పాటు ఆకర్షణీయంగా కనిపించేందుకు వాటిలో కలిపే ప్రమాదకర రసాయనాల వల్ల పిల్లలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. వీలైనంతవరకు చిన్నారులను ప్యాకెట్ ఫుడ్‌లకు దూరంగా ఉంచాలని సూచిస్తున్నారు. చిరుతిండ్ల విక్రయాలపై అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి నాణ్యతలేని వాటిని నిషేధించాలని, పాఠశాలల సమీపంలో వాటి అమ్మకాలపైన నిషేధం విధించాలని పలువురు కోరుతున్నారు.



దుత్తలూరులోని ఓ దుకాణంలో విక్రయిస్తున్న నాణ్యత లేని చిప్స్ ప్యాకెట్లు



దుత్తలూరులోని ఓ దుకాణంలో విక్రయించిన గడువు తేదీ ముగిసిన ప్యాకెట్ (ఫైల్)

జంక్ ఫుడ్‌తో ఆరోగ్య సమస్యలు



బయట ప్యాకెట్లలో లభ్యమయ్యే నాణ్యత లేని చిరుతిండ్లు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అవి ఎక్కువ రోజులు నిల్వ ఉండాలనే ఉద్దేశంతో వాటిలో వివిధ రకాల రసాయనాలు వాడుతున్నారు. రుచి కోసం అధిక మోతాదులో మసాలా, ఆకర్షణీయమైన రంగుల కోసం ప్రమాదకర పౌడర్లు వినియోగిస్తున్నారు. వీటిని తినడం వల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తప్పవు.

–డాక్టర్ ఆయూబ్ అఫ్సర్, వైద్యాధికారి, దుత్తలూరు పీహెచ్‌సీ

నృత్య కళాకారులకు అభినందన



ఆత్మకూరు: పట్టణానికి చెందిన శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయం విద్యార్థులు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో ప్రతిభకనబర్చి పురస్కారాలను అందుకున్నారు. అలాగే నృత్య విద్యాలయం నిర్వాహకురాలు అపర్ణ నాట్య ప్రవీణ అవార్డును అందుకున్నారు. నృత్య శిక్షణ గురువు ఆనంద్‌ను రవీంద్ర భారతిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిని ఆత్మకూరులోని శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయంలో ఆదివారం పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల వితరణ

కావలి : పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న డీఆర్ విశ్వోదయ సేవా సమితి కార్యాలయంలో నిరుపేద వృద్ధులకు ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేంద్రరెడ్డి 60 మంది వద్దులకు రూ.60 వేల విలువైన బియ్యం, ఇతర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా కాటా సురేంద్రరెడ్డి మాట్లాడుతూ విశ్వోదయలో తాను విద్యతో పాటు, సేవాభావం, సంస్కారం నేర్చుకున్నానని తెలిపారు. డీఆర్ గొప్ప దార్శనికు డు, విద్యా ప్రదాతని, వారు సమాజానికి చేసిన సేవలు అమూల్యమన్నారు. వారి స్ఫూర్తితో విశ్వోదయ కళాశాలలు, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వినయకుమార్ రెడ్డి, విద్యాధరకుమార్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. అలా ఎవరైనా చూడకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి భరణం పొందవచ్చని తెలిపారు. పిల్లల ఆదరణ కోల్పోయిన వృద్ధులు ఎవరైనా న్యాయసాయం కోరితే తాను అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, సేవా సమితి చైర్‌పర్సన్ దొడ్ల లక్ష్మి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్, రంగనాయకులు పాల్గొన్నారు.



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

అంకమ్మకు పొంగళ్లు

చేజర్ల: మండలంలోని కొట్టాలులో అంకమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సామూహికంగా మేళతాళాల నడుమ పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా అంకమ్మకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకరణలో దర్శనమిచ్చారు.

శాకంబరిగా ఇష్టకామేశ్వరి



సీతారామపురం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఘటిక సిద్దేశ్వరంలో కొలువైన ఇష్టకామేశ్వరి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

ఉదయగిరి: కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయగిరి, వింజమూరులోని సాయిబాబా మందిరాల్లో విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. సాయిబాబా విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కొండాపురం: కొమ్మిలోని సాయిబాబా మందిరంలో ఉదయం విఘ్నేశ్వర పూజ, రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకిసేవ, పవళింపుసేవ నిర్వహించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

జలదంకి: మండలంలోని చామదల, బ్రాహ్మణక్రాకలోని సాయిబాబా మందిరాల్లో ఉదయం 5 గంటలకు కాగడహారతి, 7 గంటలకు క్షీరాభిషేకం, గణపతి పూజ, పుణ్యహవాచనం, ఉదయం 9 గంటలకు కలశస్థాపన, మండపారాధన, 10 గంటలకు అగ్ని మదనం, నూతన ధుని ప్రారంభం, పూలంగిసేవ, 11 గంటలకు గణపతి హోమం, నవగ్రహ మూలమంత్ర హోమం నిర్వహించారు. సాయంత్రం సంధ్యాహారతి, పల్లకిసేవ జరిపారు. చామదలలో వైఎస్సార్‌సీపీ నేతలు వంటేరు హజరత్‌రెడ్డి, వంటేరు లక్ష్మీనరసారెడ్డి, బ్రాహ్మణక్రాకలో జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. చామదలలోని వశిష్ఠ ఆశ్రమంలో అచలానంద గురువు రాపూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు.

కలిగిరి: స్థానిక సాయిబాబా మందిరంలో సాయిబాబాకు క్షీరాభిషేకం, విశేష పూజలు, పల్లకిసేవ నిర్వహించారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నదానం చేశారు.

ఆత్మకూరు: పట్టణంలోని సాయిబాబా మందిరాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయిబాబాకు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెం, మహిమలూరు, గండ్లవేడు, బట్టేపాడు, మురగళ్ల, తదితర గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో విశేషాభిషేకాలు, పూజలు, గిన్నెభిక్ష, గ్రామోత్సవాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మహిమలూరులో బెస్త కులస్తుల ఆధ్వర్యంలో వ్యాసభగవానుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.

సంగం: సంగంలోని కొత్తూరుతో పాటు వెంగారెడ్డిపాళెం, పడమటిపాళెం, దువ్వూరు, తదితర గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సామూహికంగా మహిళా భక్తులు కుంకుమార్చన చేశారు. సంగంలోని తిరుమలకొండలో కొలువైన రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరులోని సాయిబాబా మందిరంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా గ్రామోత్సవం జరిపారు. శ్రీసాయితేజ ట్రస్టు చైర్మన్ బోయళ్ల జనార్దన్‌రెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు.

బిట్రగుంట: బోగోలు పంచాయతీ రాజావీధి, విశ్వనాథరావుపేట, కొండబిట్రగుంట, పాతబిట్రగుంటలోని సాయిబాబా మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. బాబాకు ఉదయం సుప్రభాతసేవ, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గురు, దత్త చరిత్ర పారాయణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అల్లూరు: అల్లూరుపేట సత్రంలోని షిరిడీ సాయిబాబా మందిరములో ఉదయం విశేషాభిషేకాలు, లక్ష మల్లెలార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి పుష్పపల్లకి సేవ, శేజ్ హరతి, పవళింపు సేవ జరిపారు.



ఆత్మకూరురూరల్: మహిమలూరులో వ్యాస మహర్షికి పూజలు



కలిగిరిలో విశేషాలంకారంలో సాయిబాబా



సంగంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



జలదంకి: చామదలలో గణపతి హోమం



ఉదయగిరి: సాయిబాబాకు భక్తుల పూజలు

తెలుగు ఉపాధ్యాయుడికి సన్మానం



శివశంకరయ్యను సత్కరిస్తున్న ఆలూరు శిరోమణి దంపతులు

మర్రిపాడు: మండలంలోని చుంచులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శివశంకరయ్యను తిక్కన లలిత కళాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ ఆలూరు శిరోమణిశర్మ దంపతులు సత్కరించారు. కోవూరులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో తిక్కన లలిత కళాపీఠం, బ్రాహ్మణ సమైక్య సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో శివశంకర్‌ను పట్టు వస్త్రాలతో సత్కరించి వెండి పతకాన్ని అందజేశారు. అనంతరం శివశంకరయ్య తాను సేకరించిన తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం తాళపత్ర గ్రంథంలోని సభా పర్వంలోని పద్యాలను చదివి వినిపించారు. శివశంకరయ్య సేకరించిన 800 కాల నాటి తాళపత్ర గ్రంథాలను అందరూ ఆసక్తిగా తిలకించి అభినందించారు.